క్లుప్తంగా

పట్టభద్రుల ఎన్నికల్లో మద్దతు తెలపండి



గురజాల రూరల్: గుంటూరు-కృష్ణా పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నేత గౌతంరెడ్డిని గురజాలలో సోమవారం పలువురు పట్టభద్రులను కలిశారు. స్థానిక కోర్టు నందు గల బార్ అసోసియేషన్, తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్టీఓ కార్యాలయంతో పాటు పలు కార్యాలయాల్లో పట్టభద్రులను కలిసి గుంటూరు-కృష్ణా పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలని ఓటర్లను కోరారు. గౌతం రెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, జక్కా రమణ, కర్రా చినకోటేశ్వరరావు, న్యాయవాదులు ఎం.శ్రీనివాసరెడ్డి, బి.నాగిరెడ్డి , చల్లా రామిరెడ్డి తదితరులున్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



పిడుగురాళ్ల: జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని 2వ వార్డులో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ కె.మేఘమాల దిన చర్య, ఋతుచర్యల్లో ఆచరించాల్సిన నియమాలు, యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద కాంపౌండర్ పి.ప్రసాద్, యోగా శిక్షకులు హనుమంతునాయక్, కోటేశ్వరమ్మ, అంగన్వాడీ టీచర్లు జయశ్రీ శాంతకుమారి తదితరులు ఉన్నారు.

సేవ చేసేందుకు భక్తులు ముందుకు రావాలి

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా నవంబర్ 2వ తేదీన నిర్వహిస్తున్న అన్న సమారాధన సమయంలో సేవ చేసేందుకు భక్తులు ముందుకు రావాలని మండల ఎండోమెంట్ అధికారి గాదె రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అనేక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వారికి సేవలు అందించడానికి ఆసక్తి ఉన్నవారు ముందుగా సెల్ నంబర్ 98498 67911 సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్తీకమాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దేవస్థానం ఆవరణలో బ్లీచింగ్ స్ప్రేయింగ్ కూడా చేయించడం జరిగిందన్నారు.

ఆధార్‌కు ఫోన్ నెంబరు లింక్ చేసుకోవాలి

గురజాల: ఆధార్ కార్డుకు ఫోన్ నెంబరును గ్యాస్ వినియోగదారులు లింక్ చేసుకోవాలని ఇండెన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్ పథకంలో భాగంగా ప్రతి ఒక్క గ్యాస్ వినియోగదారుడు లింక్ చేసుకున్న సెల్ నెంబరు నుంచి మాత్రమే బుక్ చేయాలన్నారు. గ్యాస్ ఇంటికి డెలివరీకి వచ్చిన సమయంలో సెల్ నెంబరుకు నాలుగు అంకెలతో కూడిన పిన్ నెంబరు వస్తుందన్నారు. పిన్ నెంబరును గ్యాస్ డెలివరీ బాయ్‌కి చెప్పాలన్నారు. గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీ వారికి సహకరించాలన్నారు.

ఆడపిల్లల భద్రత అందరి బాధ్యత



నరసరావుపేట ఈస్ట్: ఆడపిల్లల భద్రత అందరి బాధ్యతగా గుర్తెరగాలని వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు పోక్సో చట్టంపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంబా నరసింహారావు అధ్యక్షత వహించారు. సదస్సులో సీఐ చరణ్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ ఆడపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిరోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత వారితో మాట్లాడాలని తెలిపారు. పిల్లలు చెప్పే ప్రతి విషయాన్ని వినటంతో పాటు వారి భావాలను అర్థం చేసుకొని మెలగాలని కోరారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో ఆడపిల్లలు స్వేచ్ఛ గా ఎదిగేలా చూడా లని తెలిపారు. స్నేహానికీ, తాత్కా లికంగా ఏర్పడే మోహానికి మధ్య తేడాలను అర్థమయ్యేలా తెలియ చెప్పాలన్నారు. చిన్నారులు తమకు ఏదైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు పెద్దలకు తెలియచేయాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

మట్టి ప్రమిదలకు ఆదరణ కరువు

- ప్లాస్టిక్ ప్రమిదల వైపు కొనుగోలుదారుల చూపు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న చేతివృత్తి దారులు



గురజాలలో విక్రయానికి ఉంచిన మట్టి ప్రమిదలు

గురజాల: ప్రతి ఇంటా వెలుగులు నింపే దీపావళి పండుగ అంటే అందరికీ ఇష్టమే. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను అందరూ వెలుగులు దివ్వెల నడుమ ఘనంగా జరుపుకొంటారు. ప్రతి ఇంట్లో వెలుగులు నింపుతున్న దీపావళి ప్రస్తుతం చేతివృత్తిదారులకు మాత్రం వెలుగులు నింపలేకపోతుంది. గతంలో దీపావళి వస్తుందంటే మూడు నాలుగు నెలల ముందు నుంచే చేతివృత్తిదారులు చాలా బిజీగా ఉండేవారు. ముఖ్యంగా శాలివాహనులు చిచ్చుబుడ్లు, ప్రమిదల తయారీలో నిమగ్నమయ్యేవారు. వీటి తయారీ ద్వారా గతంలో తగినంత ఆదాయం లభించేది. గతంలో కేవలం మట్టితో తయారుచేసిన చిచ్చుబుడ్లు, ప్రమిదలు మాత్రమే అందుబాటులో వుండేవి. వాటినే అందరూ వాడేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిస్కో బుడ్లు, రెడీమెడ్ ప్రమిదలు అందుబాటులోకి రావడం స్థానికంగా తయారుచేసే వాటికి గిరాకీ తగ్గింది. చూడ్డానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండే రాజస్థాన్ ప్రమిదలు, ఫ్యాన్సీ దీపాలు, ప్లాస్టిక్ చిచ్చుబుడ్లపై యువత ఆసక్తి చూపడంతో చేతివృత్తిదారులు తయారుచేసిన వాటికి ఆదరణ తగ్గి, ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

గతమెంతో ఘనం..

గతంలో గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారుగా 100 కుటుంబాలకు పైగా మట్టి కుండలు, మట్టి ప్రమిదలు తయారుచేస్తూ కులవృత్తిపై జీవనం సాగించేవారు. కానీ నేడు చూద్దామన్నా మచ్చుకైనా కనిపించడం లేదు. కుల వృత్తులకు ఆదరణ తగ్గడంతో కులవృత్తిని నమ్ముకున్నవారు తప్ప, మిగతా యువత అంతా ఇతర రంగాల వైపు మొగ్గు చూపడంతో మట్టి ప్రమిదలు, స్థానికంగా తయారయ్యే చిచ్చుబుడ్లు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. దీపావళి పండుగకు రెండు నెలల ముందు నుంచి ప్రమిదలు, చిచ్చుబుడ్లు, తయారు చేస్తూ శాలివాహనులు ఉపాధి పొందేవారు. పెద్దతరం వారు మాత్రం నెల రోజుల నుంచి వీటిని తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.



ప్లాస్టిక్ ప్రమిదలు

కులవృత్తిని వదులుకోలేక..



పెద్దల నుంచి కులవృత్తి వస్తుంది. దానిని వదులుకోలేక ఈ పని చేస్తున్నాం. ప్రస్తుతం చేతివృత్తి దారులకు పనులు పూర్తిగా సన్నగిల్లాయి. గతంలో వేసవి కాలంలో కుండలు, దీపావళి, శివరాత్రి వంటి పర్వదినాల్లో దీపం ప్రమిదలు వంటివి తయారుచేస్తూ బిజీగా ఉండేవారం. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ రెడీమేడ్‌పై దృష్టి సారిస్తున్నారు. కుల వృత్తులు చేయడానికి ఈ తరం యువత ఇష్టపడటం లేదు.

– డి.మంగయ్య, గురజాల

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

పట్టణ సీఐ భాస్కర్



గురజాల: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసే దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పట్టణ సీఐ భాస్కర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అధికారులు ఆదేశించిన ప్రాంతాల్లోనే దుకాణాలు (స్టాల్)ను ఏర్పాటుచేయాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి స్టాల్‌లో విధిగా ఇసుకతో పాటు నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికారుల నిబంధనలు ప్రకారం బాణసంచా అమ్మకాలు జరపాలని లేకపోతే అట్టివారిపై చర్యలు చేపడతామన్నారు.

పిడుగురాళ్ల: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో బాణాసంచా దీపావళి మందులు విక్రయించేందుకు ప్రభుత్వ అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపారు. అనుమతులు లేకుండా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన జడ్పీ హైస్కూల్ నందు మాత్రమే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, దుకాణాల ఏర్పాటు ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం తగిన జాగ్రత్తలు పాటించాలని తెలియజేసారు. బాణసంచా పేల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రంగా విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన దుండగులు



మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. గ్రామంలోని పాల కేంద్రం సెంటర్ వద్ద 2013లో కన్నా లక్ష్మీనారాయణ వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. సోమవారం ఉదయం గ్రామస్తులు విగ్రహం కుడిచేయి భుజంపై బలమైన వస్తువుతో దాడి చేయగా, విరిగినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ, జనసేన నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సతీష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రంగా విగ్రహ ధ్వంసం హేయం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మాచవరం మండలం వేమవరంలో రంగా విగ్రహంపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. వంగవీటి మోహన్‌రంగా ఒక్క కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కాదని, పీడిత, తాడిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకుడని అన్నారు. అలాంటి మహనీయుని విగ్రహంపై దాడి చేయడం సమజసం కాదని, దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

17న రెడ్డి కార్తిక వనసమారాధన

వినుకొండ(నూజెండ్ల): శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి సమావేశం స్థానిక రెడ్డి సంఘం కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సమితి ప్రెసిడెంట్ శివారెడ్డి మాట్లాడుతూ నవంబరు 17వ తేదీన రెడ్డి కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నామని అందరూ పాల్గొనాలని కోరా రు. కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించా లని సూచించారు. రెడ్డి సంఘం భవనం, సత్రం పనులు చాలా వేగంగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా పేద రెడ్డి విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ నవంబరు 10 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నా రు. అదేరోజు ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమితి సెక్రటరీ పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ కర్నాటి చెన్న కేశవరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, గంధం బాలిరెడ్డి, కేసరి ప్రకాష్‌రెడ్డి, తుపాకుల కొండల్‌రెడ్డి, సోము వెంకటేశ్వరరెడ్డి, రొడ్డా శ్రీనివాసరెడ్డి, బిక్కం వెంకటనారాయణరెడ్డి, మాలపాటి భాస్కరరెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి, బలరాం రెడ్డి, ఎరుకల రెడ్డి, సంజీవరెడ్డి, జయకృష్ణా రెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

బెండ సాగు.. లాభాలు బాగు



బెండతోట

- నియోజకవర్గంలో పెరుగుతున్న కూరగాయల సాగు
- బెండ సాగువైపే రైతుల మొగ్గు
- లాభాలు తెచ్చిపెడుతున్న పంట

పిడుగురాళ్లరూరల్: బెండ కాయల్లో ఏబీసీ విటమిన్లతోపాటు అయోడిన్ ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో పండిపదార్థం, పీచుపదార్థం, కాలుష్యం, మెగ్నిషియం, జింకు ఉండి మంచి పోషకాలు అందిస్తోంది. అలాంటి బెండను వ్యాపార పరంగా పండిస్తూ పెద్ద మొత్తంలో లాభాలను అందిపుచ్చుకుంటున్నారు నియోజకవర్గంలోని రైతులు. నియోజకవర్గంలో సుమారుగా 800 ఎకరాల పై చిలుకుగా కూరగాయల సాగును రైతులు సాగు చేస్తున్నారు. అందులో 500 ఎకరాలకు పైగా రైతులు బెండను పండిస్తున్నారు. విత్తనం నాటిన దగ్గర నుంచి 60 రోజుల్లో దిగుబడి రావటంతో రైతులంతా బెండ వైపే ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు పత్తి పంట పండించే రైతులు సైతం బెండ పంట వైపు మొగ్గు చూపుతున్నారు.

60 రోజులకే మొదటి కోత..

బెండ పంటలో రోజు మార్చి రోజు రైతులు కోత కోస్తారు. కోసిన రోజు ఎకరానికి 6 క్వింటాళ్ల నుంచి పంది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పెట్టుబడి ఖర్చులు వచ్చినా అక్టోబర్ మాసంలో బెండ కేజీ రూ. 40 నుంచి రూ. 50 వరకు రైతుకు గిట్టుబాటు అవుతుంది. దీంతో రైతుకు లాభదాయకం అవుతోంది. మాచవరం మండలంలోని గంగిరెడ్డిపాలెం, పిడుగురాళ్ల మండలంలోని వీరాపురం, పెద అగ్రహారం, బ్రాహ్మణపల్లి, దాచేపల్లి మండలంలో కొత్తూరు, గురజాల మండలంలోని అంబాపురం వంటి గ్రామాల్లో బెండను విస్తారంగా సాగు చేశారు. కోసిన బెండ కాయలను నల్గొండ, హైదరాబాద్, గుంటూరు మార్కెట్లకు నిరంతరం తరలిస్తున్నారు.

రబీలోకూడా బెండ సాగుకు రైతులు మొగ్గు



ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో 500 ఎకరాలకు పైగా బెండ పంటను వేశారు. మద్దతు ధర ఆశాజనకంగా ఉండటంతో రబీ సీజన్‌లో ఎక్కువగా బెండ పంటను పండించేందుకు సన్నద్ధమతున్నారు.

– వై.మోహన్, ఉద్యానశాఖ అధికారి, పిడుగురాళ్ల

రెండు ఎకరాల్లో సాగు చేశా



గత మూడు సంవత్సరాల నుంచి బెండ పంటను సాగు చేస్తున్నాను. కానీ ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాదికి బెండకు మంచి మద్దతు ధర దొరుకుతుంది. ఎప్పుడు పెట్టుబడులు మాత్రమే వచ్చేవి. కిలో రూ. 50 వరకు అమ్మటంతో లాభాలు కూడా వస్తున్నాయి.

– జంగిటి సుధాకర్, రైతు, పెద అగ్రహారం

ఇప్పుడిప్పుడే లాభాలు వస్తున్నాయి..



నేను ఎకరంన్నరలో బెండ పంటను పండిస్తున్నాను. నా వాటితోపాటు మిగతా రైతుల వద్ద కూడా మేమే కొనుగోలు చేసి గుంటూరు, నల్గొండ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తీసుకొని వెళ్లి అమ్మకాలు చేస్తున్నాం. ఆగస్టు, సెప్టెంబర్‌లో కేజీ రూ. 20 ఉండగా, ఈ నెలలో ఒక్కసారిగా ధర రూ. 50 పలకటంతో కాస్త లాభాలు వస్తున్నాయి.

– దాదినబోయిన రాముడు, పెద అగ్రహారం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాచర్ల: పట్టణంలో అతిసార వ్యాధి ప్రబలిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు సోమవారం తెలిపారు. ఈమేరకు పురపాలక సిబ్బందితో పట్టణంలోని అన్ని వార్డుల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. డయేరియా కేసులు నమోదవుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా వైద్యులు, పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పట్టణంలో పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలో పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య లేకపోవడం వలన కార్మికులపై పనిభారం పడుతుందన్నారు. పెరిగిన పట్టణీకరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, మృతిచెందిన కార్మికులకు రావాల్సిన పరిహారం వెంటనే చెల్లించాలని, పనిముట్లు, పుష్ కార్టులు, ట్రాక్టర్లు రిపేర్ చేయించాలని తెలిపారు. చీపుర్లు, పలుగులు, పారలు పదును పెట్టించాలని తెలియజేశారు. వియవాడ వరదల సందర్భంగా పని చేసిన కార్మికులకు ఒక జత బట్టలు, ఒక నెల వేతనం అదనంగా ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలలు హెల్త్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని, ఎన్ఎంఆర్‌లకు నాలుగు నెలలు, టీఎల్ఎఫ్ కార్మికులకు మూడు నెలలు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్‌లో సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్మికులు బత్తుల రామారావు, కుంభా కొండలు, అంగిడీ రామారావు, సుజాత, బత్తుల పార్వతి, దేవరకొండ లక్ష్మి, ఎదురు లక్ష్మి, బత్తుల అనిల్, మొగిలి ప్రతాప్, గుంటి నాగేశ్వరరావు, దేవరకొండ మార్తమ్మ, కొమెర గురవయ్య, చల్లా లక్ష్మీ, మావిడాల శ్రీను తదితరులు ఉన్నారు.

ఆలయాల పరిశుభ్రత ప్రతి భక్తుని బాధ్యత



స్వచ్ఛతా కి సేవా కార్యక్రమంలో పాల్గొని దేవస్థానానికి డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న ఐటీసీ అండ్ సెర్ప్ సభ్యులు

సత్రశాల(రెంటచింతల): పవిత్రమైన అతి ప్రాచీన శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం పరిసరాల పరిశుభ్రత ప్రతి భక్తుని బాధ్యత అని ఐటీసీ అండ్ సెర్ప్ సీఓ మాడెబోయిన గురుమూర్తి అన్నారు. ఐటీసీ అండ్ సెర్ప్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కి సేవా కార్యక్రమంలో భాగంగా దేవస్థానాన్ని గ్రీన్ టెంపుల్‌గా ఎంపికచేసి సోమవారం రెండు డస్ట్‌బిన్లను అందజేసి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ స్వచ్ఛతా కి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేవస్థానాన్ని సందర్శించే భక్తులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. దేవస్థానం సమీపంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. దేవస్థానం పరిసరాలలో వ్యర్థాలను భక్తులు సక్రమైన పద్ధతిలో తొలగించడం వలన తక్కువ ఖర్చుతో వ్యర్థరహిత దేవస్థానంగా తీర్చిదిద్దవచ్చన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల మల్లిఖార్జునశర్మ, సాయి సుందర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కోనంకిలో పట్టపగలు దొంగతనం

6 సవర్ల బంగారు నగలు చోరీ

పిడుగురాళ్ల: పట్టపగలు దొంగతనం జరిగిన సంఘటన మండలంలోని కోనంకి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం కోనంకి గ్రామానికి చెందిన రమాదేవి, సుబ్బారెడ్డి దంపతులు రోజులాగే ఇంటికి తాళాలు వేసి పొలం పనులకు వెళ్లారు. పొలం నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. హుటాహుటిన ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా, అందులో ఉన్న 6 సవర్ల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన నగలు విలువ సుమారు రూ. 4లక్షల వరకు ఉంటుందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను

మాచర్ల: అనారోగ్యంగా ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను సూచించారు. సోమవారం ఆమె ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ప్రతిరోజూ ఒకటి, రెండు డయోరియా కేసులు వస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఇంతవరకు డయేరియా వల్ల మాచర్ల పట్టణంలో ఎవరూ మృతిచెందలేదన్నారు. వర్షాలు, అపరిశుభ్ర వాతావరణం వల్ల ఆయా ప్రాంతాల్లో నామమాత్రపు కేసులు నమోదవుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఎలాంటి కేసులు నమోదైనా 24 గంటలూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆమె చెప్పారు.

విద్యుత్ ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కారెంపూడి మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు

కారెంపూడి: కార్యాలయంలో మద్యం సేవిస్తున్నారనే ఆరోపణపై నలుగురు విద్యుత్ ఉద్యోగులను ఏక కాలంలో సస్పెండ్ చేయడం తగదని కారెంపూడి మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, పలువురు నాయకులు సోమవారం విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. అసలే సిబ్బంది కొరతతో విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడం లేదని, గాదెవారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో సమస్యలు తలెత్తితే పరిష్కరించేందుకు సిబ్బంది లేరని ఈ విషయమై ఉన్నతాధికారులు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. డిపార్ట్‌మెంట్‌తో సంబంధం లేని వ్యక్తి వీడియో తీయడం దాన్ని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారని, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన వార్త దినపత్రికల్లో రావడంతో ఉన్నతాధికారులు ఉద్యోగులను సస్పెండ్ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. విచారణాధికారి నివేదికతో ఒక ప్రముఖ నాయకుని సిఫారసు ఆధారంగా ఉద్యోగులను సస్పెండ్ చేయడం వల్ల వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. అంతేకాకుండా సేవలు నిలిచిపోయి రైతులు, వినియోగదారులు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులకు గురి అవుతున్నారని వారి సస్పెషన్‌ను ఎత్తి వేసి వారిని విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

- కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన మున్సిపల్ కార్మికులు
- కార్యాలయం ఎదుట ధర్నా



కమిషనర్ జస్వంతరావుకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నరసరావుపేట: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వచ్చే 15 రోజుల వ్యవధిలో పరిష్కరించకపోతే ఆందోళన చేయటంతో పాటు సమ్మె చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి శిలార్ మసూద్ మాట్లాడుతూ పట్టణ విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్య ఏళ్ల తరబడి పెంచటంలేదని, కార్మికులను ఇతర పనులకు వాడుకోవటం వలన మిగిలిన కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలు, వాహనాల మరమ్మతులు, పనిముట్లు, యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈపీఎఫ్ అమలులో నాలుగు ఖాతాలను ఒకే ఖాతాకిందకు తీసుకురావాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆప్కాస్ ద్వారా రిటైర్ అయిన వారి కుటుంబంలోని పిల్లలకు ఉపాధి చూపించాలని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు స్కిల్డ్, అన్‌స్కిల్డ్ విధాన పరంగా జీతాలు చెల్లించాలని, ప్రతి నెలా ఏడవతేదీలోపు జీతాలు అందజేయాలని కోరారు. గత 17 రోజుల సమ్మె జీతం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు పెంపుదల చేయాలని కోరారు. విజయవాడ వరదల ముంపు సందర్భంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులు నివారించాలని అన్నారు. నాయకులు డి.యోహాను, టి.మల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషనులో బైకు దొంగతనం!

శావల్యాపురం: పోలీసుస్టేషనులో బైకు మాయమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం ప్రకారం.. శావల్యాపురంలో పోలీసు స్టేషను కూతవేటు దూరంలో ఉన్న పోలేరమ్మ దేవాలయంలో చోరీ చేయడానికి గుర్తు తెలియని వ్యక్తి ఒకరు బైకుపై వచ్చాడు. అదే సమయంలో స్థానికులు గుర్తించి సదరు వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేయగా తప్పించుకొని పారిపోయాడు. గ్రామస్తులు బైకును (ఏపీ 07 బీఎస్ 3406) స్వాధీనం చేసు కొని పోలీసు స్టేషనులో అప్పగించారు. అయితే స్టేషను బయట ఉంచిన ఈ బైకును ఎవరో అపహరించారు. సోమవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విచ్చేసిన వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్‌ను గ్రామస్తులు అడగ్గా బైకు సత్తెనపల్లికి చెందిన సంతోష్‌దిగా గుర్తించామన్నారు. దీనిపై విచారణ జరుగుతోందని నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.